క్లుప్తంగా

బీమాతో పాడి రైతుకు ధీమా


మాట్లాడుతున్న రవికుమార్

గూడూరురూరల్ : పశు బీమాతో పాడి రైతుకు ఎంతో ధీమా కలుగుతుందని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎ.రవికుమార్ అన్నారు. గూడూరులోని ప్రాంతీయ పశువైద్యశాలలో మంగళవారం పశు బీమాపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పాడిరైతులు పశువులకు బీమా చేసుకోవచ్చన్నారు. దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రభుత్వం 80 శాతం రాయితీ ఇస్తుందన్నారు. బీమా చేయించేటపుడు బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్‌కార్డుతోపాటు బియ్యం కార్డు, కుల ధ్రువీకరణ పత్రం తీసుకెళ్లాలని సూచించారు.

భక్తి శ్రద్ధలతో నిషాన్


దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మత గురువులు

గూడూరురూరల్: పట్టణంలోని హజరత్ సయ్యద్ హాషిం హుస్సేనీ బాబా దర్గాలో నిషాన్ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మతగురువుల ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా లయన్ షేక్ రియాజ్ అహ్మద్ ఇంటి నుంచి ఫకీర్ల జరాబులతో నిషాన్‌ను ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకొచ్చి ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ఆవరణలో దర్గా వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముజావర్ మగ్దూమ్ అలీషా, మత గురువులు ఖమర్ అలీషా, మస్తాన్ ఆలీషా, కరిముల్లాషా, దర్గా కమిటీ ప్రతినిధులు ఇలియాజ్ అహ్మద్, సందాని బాషా, షానవాజ్, షబ్బీర్, యస్దానీ, గోల్డెన్ గౌస్, కరిముల్లా, సైదులు, జలీల్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు 8 మంది హాజరు

చిల్లకూరు: మండలంలో వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 8 మంది హాజరైనట్లు ఎంపీడీఓ గోపీనాథ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి వారికి మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఫలితాలను వారికి తెలియజేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

చురుగ్గా రహదారి సర్వే పనులు


సర్వే పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

చిల్లకూరు: మండలంలోని జాతీయ రహదారి నుంచి గూడూరులోని గాంధీనగర్ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం సర్వే పనులు ప్రారంభించారు. వీఆ ర్వో గిద్దలూరు రమణయ్య, సర్వేయర్ రాంకుమార్, జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతు గ్రూపులకు రుణాలు

చిల్లకూరు: మహిళా రైతుల కోసం రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ గ్రూపులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వనున్నట్లు వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం గునయ్య తెలిపారు. మండల కేంద్రమైన చిల్లకూరులోని వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో మంగళవారం నూతనంగా మహిళా రైతు గ్రూపుల సమాఖ్యను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళా రైతు గ్రూపుల సమాఖ్య ద్వారా ఎరువులు, విత్తనాలు విక్రయించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మండలంలోని 40 మహిళా రైతు గ్రూపులతో సమావేశం నిర్వహించి, మండల సమాఖ్య అధ్యక్షురాలి ఎన్నిక జరిపామన్నారు. అధ్యక్షురాలిగా ఉడతావారిపాళేనికి చెందిన వెంకటరమణమ్మ ఎన్నికయ్యారన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

గూడూరు: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం గూడూరు, కోట, వెంకటగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల పోస్టుల భర్తీకి ఆర్డీఓ కిరణ్‌కుమార్ అధ్యక్షతన ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. త్వరలో అర్హులైన వారి జాబితా ను ప్రకటించనున్నట్లు ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి జయలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జాన్సన్, సీడీపీఓలు షంషాద్‌బేగం, మెహబూబీ, మునికుమారి, తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి

బాలాయపల్లి (తిరుపతిఅర్బన్): నాడు–నేడులో భాగంగా జరుగుతున్న అంగన్ వాడీ భవనం పనులు త్వరగా పూర్తి చేయాలని ఐసీడీఎస్ వెంకటగిరి సీడీపీఓ శంషాద్ బేగం పేర్కొన్నారు. బాలాయపల్లి మండలం యాచవరంలో జరుగుతున్న అంగన్ వాడీ భవనం పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలని ఆదేశించారు. పనులను త్వరిగతిన పూర్తి చేయాలన్నారు. అంతేకాకుండా అంగనవాడీ కార్యకర్తలు పర్యవేక్షణలో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలు.. అన్నదాతకు నేస్తాలు

మట్టిని నమ్ముకున్న రైతులు విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రానికి వచ్చి క్యూలో గంటల తరబడి నిరీక్షించినా ఒక్కోసారి అందని పరిస్థితి. చివరకు శ్రమకోర్చి పంటలు పండించినా గిట్టుబాటు ధర లభించక దళారుల పాలయ్యేది. ఒకానొక దశలో క్రాప్ హాలిడేను ప్రకటించిన దయనీయమైన పరిస్థితులు. మరోవైపు సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను రైతుల పేరిట పచ్చనేతలే హాంఫట్ చేయడం..ఇదంతా టీడీపీ పాలన నాటి పరిస్థితి. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఈ దళారీ వ్యవస్థకు చెల్లు చీటి పాడేలా విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో విత్తనాలు మొదలు ఎరువులు, వ్యవసాయ పనిముట్లు తదితరాలన్నీ రైతుల ముంగిటకే చేర్చింది. ఈ సంస్కరణలు, జవాబుదారీతనంతో అందిస్తున్న సేవలు తమకు వ్యవసాయంపై భరోసానిచ్చేలా ఉంటున్నాయని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అన్నదాతకు పెద్దపీట
- ఆర్బీకేల ద్వారా రైతుల ముగింటకే సేవలు
- వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలతో విస్తృత సేవలు


చిలమానుచేనులోని రైతు భరోసా కేంద్రం

మండలం :	ఓజిలి
మొత్తం పంచాయతీలు:	265
ఆర్బీకేలు:	10
సేవలు పొందిన రైతుల సంఖ్య:	10,250

ఓజిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత వ్యవసాయానికి పెద్దపీట వేస్తోంది. రైతులు పలు పథకాలు అమలు చేసింది. ఇందులో భాగంగానే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆ కేంద్రాలు సాగులో దుక్కి మొదలు పంట నూర్పిడి వరకు కర్షకులకు అండగా నిలుస్తున్నాయి. నిత్యం వ్యవసాయశాఖాధికారులు అందుబాటులో ఉంటూ రైతులు ఏయే పంటలను సాగుచేయాలో తెలుపుతున్నారు. వ్యవసాయ పరిశోధన కేంద్రాలు నుంచి నిపుణులు, శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారు. ఈ కేంద్రాలు ద్వారానే విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు, పురుగుమందులు అందజేస్తున్నారు.సాగులో పెట్టుబడులు తగ్గి ఆదాయం పెరిగే ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లడానికి అధికారులు కృషి చేస్తున్నారు.

ఆర్‌బీకేలతో రైతులకు అందుతున్న సేవలు

రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడ సచివాలయ అగ్రికల్చరల్ అసిస్టెంట్, పశు సంవర్ధక శాఖ, ఉద్యానవన శాఖ సిబ్బంది కూడా వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. రైతులకు ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు, రొటోవేటర్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు ఇత్యాది వాటిని సబ్సిడీపై ఇస్తోంది.

- ప్రతినెలా మొదటి శుక్రవారం ప్రతి ఆర్‌బీకేలో రైతులతో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహిస్తారు. ఆ నెలలో వారికందివ్వాల్సిన సేవలపై చర్చించి ప్రాధాన్యత క్రమంలో నిర్దేశించుకుంటారు. రెండో శుక్రవారం మండల స్థాయిలో ఈ సమావేశాలు నిర్వహిస్తారు.
- మట్టి నమూనాలను సేకరించి, భూసార పరీక్షలు చేయించడమే కాకుండా ఆ రిపోర్టు ఆధారంగా వాడాల్సిన ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తారు.
- ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ 155251 టోల్ ఫ్రీ నంబరుతో రైతులకు వ్యవసాయ సమాచారం తెలుసుకునే వెసులుబాటు తీసుకొచ్చారు.
- రైతుల పొలాల్లో పీఎం కిసాన్ కింద ఈ–క్రాప్ నమోదు చేస్తారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం వాటిల్లితే రైతులకు రోజుల వ్యవధిలో పరిహారం అందేలా చూడటం.
- పంటలకు గిట్టుబాటు వచ్చేలా ప్రభుత్వమే కొనుగోలు చేసే వెసులుబాటు కల్పించారు.

ఓజిలి మండలంలో 10 సచివాలయాలు

ఓజిలి మండలంలో పది సచివాలయాల పరిధిలో పది రైతు భరోసాకేంద్రాలు నిర్మాణాలు చేపట్టారు. వీటిలో అత్తివరం, మాచవరం, ఆర్మేనిపాడు, చిలమానుచేను, కర్రబల్లవోలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కురుగొండ, ఓజిలి, ఇనుగుంట, గ్రద్దగుంట, వెంకటరెడ్డిపాళెం గ్రామాల్లో కేంద్రాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.

ఆర్బీకేలు ఎంతో ఉపయోగం



గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. గతంలో ఎరువులు, విత్తనాలు కోసం వ్యవసాయశాఖ కార్యాలయం, పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. రైతు భరోసా కేంద్రం ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే ఎరువులు, విత్తనాలు లభిస్తున్నాయి. ఆర్బీకేలు ద్వారా సమయం వృథా కాకుండా ఉంది. – జనార్దన్‌రాజు గుర్రంకొండ

వ్యవసాయానికి పెద్దపీట



వ్యవసాయంలో దుక్కి మొదలు పంట నూర్పిడికి వచ్చే వరకు మట్టి నమూనాలు, భూసారపరీక్షలు చేస్తూ వ్యవసాయానికి రైతు భరోసాకేంద్రాలు చేయూతనిస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విత్తనాలు, ఎరువులు కావాలంటే 20 కిలోమీటర్ల దూరంలోని ఓజిలికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం పక్కనే ఉన్న ఆర్బీకే నుంచి సులువుగా ఎరువులు, విత్తనాలు తీసుకుంటున్నాం.

– జడపల్లి నాగరాజు, బందారుగుంట

విస్తృతంగా సేవలు



వ్యవసాయ సిబ్బంది ఆర్బీకేల్లో అందుబాటులో ఉండి రైతులకు కావాల్సిన సేవలను విస్తృతంగా అందిస్తున్నారు. ఆర్బీకేలోని ఆన్‌లైన్ సేవలు ద్వారా రైతులకు వ్యవసాయ పరికరాలు, ఎరువులు, విత్తనాలు వేగంగా అందిస్తున్నాం. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– విజయలక్ష్మి, ఏఓ, ఓజిలి

నోటు పుస్తకాల వితరణ

నాయుడుపేట: పట్టణానికి చెందిన ఆకాశం వీరయ్య మనుమరాలు ఆకాశం ధ్యుతిధర, వర్జీనియా దేశానికి చెందిన ఆమె స్నేహితురాలు నరాలియా దూసిచ్ కలసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామగ్రిని వితరణ చేశారు. వీటిని మంగళవారం విద్యార్థులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూత అందించాలని తమ పాకెట్ మనీ రూ.25 వేలతో పలు పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలతో పాటు పెన్నులు తదితర విద్య సామగ్రిని అందజేశామన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం


లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రజలందరూ బాసటగా నిలవాలిని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోరారు. మండలంలోని కారుమంచివారికండ్రిగ, మందబైలు, శ్రీనివాసపురం, బట్టివిడత గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాల గురించి వివరించి, ఇప్పటివరకు వారు పొందిన లబ్ధిని తెలిపే బుక్‌లెట్‌లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల మతాలకతీతంగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఎమ్మెల్యేతో పాటు నాయకులకు గజపూలమాలలతో ఘన స్వాగతం పలికారు. గ్రామాల సరిహద్దులో సీఎం చిత్రపటంతోపాటు నవరత్నాల పథకాల ముగ్గులు తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కే దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ టీ సుబ్రహ్మణ్యం రెడ్డి, ఏఎంసీ చైర్మన్ టీ జనార్దన్‌రెడ్డి, రూరల్ జేసీఎస్ కన్వీనర్ ఓ కిషోర్‌యాదవ్ నాయకులు కే రాజారెడ్డి, టీ బలరామిరెడ్డి, సర్పంచ్ టీ రమణయ్య, ఎంపీటీసీ సభ్యుడు బీ హరిరెడ్డి, తిరుమలశెట్టి మణి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వంశీకృష్ణ, దారా రవి పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి


ఆస్పత్రిలో భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు సూచించారు. మంగళవారం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అధికారులు, నాయకులతో కలసి ఆస్పత్రిలో భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అక్కడి వైద్యులు, నాయకులతో పలు విషయాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ ఆస్పత్రిలో భవన నిర్మాణాలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి రూ.21 కోట్లు నిధులు కేటాయించారన్నారు. విద్య, వైద్యానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఆస్పత్రి భవనాలను ఈ ఏడాది డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ జనార్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి

గూడూరు: డివిజన్ స్థాయిలో అట్రాసిటీ కమిటీ సమావేశంలో సూచించిన సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి సూచించారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ కిరణ్‌కుమార్ అధ్యక్షతన డివిజన్‌స్థాయి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం డీవీఎంసీ సభ్యులు తీసుకొచ్చిన ఫిర్యాదులను అధికారులు 48 గంటల్లో పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. గూడూరు నియోజకవర్గంలో 25 ఏళ్ల కిందట నిర్మించుకున్న పక్కా ఇళ్లు చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. అధికారులు సర్వే చేసి, అలాంటి ఇళ్లను గుర్తిస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వారికి కొత్తగా పక్కా ఇళ్లు మంజూరు చేసేలా కృషి చేస్తామన్నారు. ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు, అట్రాసిటీ కేసుల నమోదుకు సంబంధించి తహసీల్దార్లు అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, తహసీల్దార్ లీలారాణి, సీఐ వెంకటేశ్వరరావు, డీవీఎంసీ సభ్యులు మాకాని వెంకటేశ్వర్లు, ఎస్వీ రమణయ్య, కే రవీంద్రబాబు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు వీ ప్రభాకర్‌రావు, కోటేశ్వరరావు, అడివయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాల పంపిణీ


బహుమతి అందజేస్తున్న ఎంపీపీ

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని కోటపోలూరు జెడ్పీ హైస్కూలులో పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలను నగదు ప్రోత్సాహకాలను మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆణిముత్యాలను ముందుకు తీసుకొచ్చారని తెలిపారు. ప్రథమస్థానం సాధించిన విద్యార్థిని దివ్యశ్రీకి రూ.3 వేలు రెండో స్థానంలో నిలిచిన వై. యశ్వంత్‌కు రూ.2వేలు, మూడో స్థానం దక్కించుకున్న త్రిపుర అనే విద్యార్థినికి రూ.వెయ్యి నగదు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమతం అరుణ, వైస్సార్‌సీపీ నాయకులు బద్దెపూడి మోహన్ రెడ్డి, అల్లూరు రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గొడవలకు పార్టీకి సంబంధం లేదు'


మాట్లాడుతున్న ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి

సూళ్లూరుపేట:పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వీధిలో ఈనెల 17వ తేదీన జరిగిన ఘర్షణలు వ్యక్తిగతమని, ఆ గొడవలకు వైఎస్సార్‌సీపీకి ఎలాంటి సంబంధం లేదని ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ మైలేజి పెంచుకునే కోణంలో లేనిపోని అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, నియోజకవర్గంలో టీడీపీ ప్రాభవం కోల్పోవడంతో ఇరు వర్గాల నడుమ జరిగిన ఘర్షణను వైఎస్సార్‌సీపీకి అంటగట్టి, నిందారోపణలు చేస్తున్నారన్నారు. ఘర్షణలో గాయపడిన కట్టబోయిన వెంకటేష్‌ను ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి అంటున్నారు. ఆయన టీడీపీ కార్యకర్త ఎలా అవుతారని ప్రశ్నించారు. కట్టబోయిన వెంకటేష్, వేమనబోయిన రాకేష్ ఒకప్పుడు మంచి స్నేహితులని, అభిప్రాయబేధాలు రావడంతో వారు విడిపోయారన్నారు. అప్పటి నుంచి వీరిద్దరూ గొడవ పడుతున్నారన్నారు. అయినా రాకేష్, సురేంద్రలతో పాటు తమతో ఉన్న వారిని ఎలాంటి గొడవలకు పోవద్దని పార్టీ నాయకులుగా తాము హెచ్చరిస్తూనే ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జెట్టి వేణుయాదవ్, మీజూరు రామకృష్ణారెడ్డి, చిన్ని సత్యనారాయణ, తుపాకులు ప్రసాద్, ఆబాక రమేష్‌రెడ్డి, బద్దెపూడి మోహన్‌రెడ్డి, వాకాటి బాబురెడ్డి, చిలకా యుగంధర్, కృపాకర్‌రెడ్డి, హుస్సేన్ పాల్గొన్నారు.

పనులు సత్వరం పూర్తి చేయండి

సైదాపురం: మండలంలోని కృష్ణారెడ్డిపల్లె, గులించెర్ల పాఠశాలల్లో నాడు–నేడు పనులను వేగవంతంగా చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సూచించారు. అయా గ్రామాల్లో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనుల్లో నాణ్యతా ప్రమానాలు పాటించాలని సూచించారు. ఆయన వెంట ఏఈ దయాళ్ తదితరులున్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత


నగదు అందజేస్తున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు: మండల కేంద్రానికి చెందిన ఏడాం జ్యోతికుమార్‌కు మంగళవారం ఎంపీపీ శేఖర్‌రెడ్డి, సర్పంచ్ టీ వాణి చేతులు మీదుగా వైఎస్సార్ బీమా నగదు రూ.10 వేలు అందజేశారు. జ్యోతికుమార్ భార్య శంకరమ్మ(45) సోమవారం గుండెపోటుతో మృతి చెందింది. దీంతో వైఎస్సార్ బీమా పథకం కింద బాధిత కుటుంబానికి మట్టి ఖర్చుల కింద రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాయుడు, మోహన్‌రెడి, గోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలి


మాట్లాడుతున్న కౌన్సిలర్ రాధమ్మ

వెంకటగిరి: ఇళ్లను త్వరిగత నిర్మాణాలు పూర్తి చేయాలని 16వ వార్డు కౌన్సిలర్ ధనియాల రాధ పేర్కొన్నారు. సచివాలయంలో మంగళవారం సచివాలయ అధికారులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఇళ్లు నిర్మించుకునే వారికి సకాలంలో బిల్లు జమ అవుతున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్ మదన్, పాల్గొన్నారు.

బీమా స్పెషల్ డ్రైవ్

దొరవారిసత్రం: వేణుంబాకం సచివాలయం పరిధిలోని వేణుంబాకం, వెదురుపట్టు పంచాయతీల్లో మంగళవారం ప్రభుత్వ బీమా పథకాల అమలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని ఎంపీడీఓ సింగయ్య తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పథకాలు నూరు శాతం ప్రతి కుటుంబానికి వర్తించేలా కృషి చేస్తున్నామన్నారు. తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఆలయ భూముల సర్వే

వాకాడు: మండల కేంద్రంలోని పలు ఆలయాలకు చెందిన భూముల సర్వేని ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు మంగళవారం ప్రారంభించారు. గ్రామ ఆలయాల కమిటీ చైర్మన్ జీ వేంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ నాగేశ్వరస్వామి, అలఘునాథస్వామి, రామాలయాలకు రికార్డుల ప్రకారం 106 ఎకరాలు భూమి ఉందన్నారు. పూర్తి స్థాయిలో సర్వే జరిపి, ఆక్రమణలను తొలగించి ఆలయ భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు.

ఎంఈఓకు సన్మానం


జగదీష్‌బాబును సన్మానిస్తున్న ఎస్టీయూ నేతలు

దక్కిలి: మండల ఎంఈఓ–2గా పదోన్నతి పొందిన జగదీష్‌బాబును ఎస్టీయూ దక్కిలి శాఖ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు తాళ్లూరు శ్రీనివాసులు, ఎంఈఓ–1 కిల్లా వెంకటేశ్వర్లు, ఎస్టీయూ నాయకులు టి శ్రీనివాసులు, బి కోటేశ్వరరావు, శివకుమార్, రామారావు, రమేష్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం

తడ:మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ కొళవి రఘురెడ్డి అన్నారు. వీఓఏలతో తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ఆమోసుబాబు, ఏపీఎం రాజారెడ్డి, ఎల్‌సీసీ మునెయ్య,సీసీలు జనార్దన్,వెంకటేశ్వర్లు, సలోమి, అరుణ పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాలి


పురస్కారాలు అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు

చిల్లకూరు: పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి, ఆణి ముత్యాలు పథకంలో బహుమతులు అందుకుంటున్న విద్యార్థులను మిగిలిన వారు స్ఫూర్తిగా తీసుకోవాలని వరగలి జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం మరుదవతి అన్నారు. మండలంలోని వరగలి జెడ్పీ హైస్కూలులో గత ఏడాది పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఆణి ముత్యాలు పురస్కారాలను మంగళవారం సర్పంచ్ బండి మాధవి, ఎంపీటీసీ సభ్యుడు దారా కోటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులు బీ మానస, లోహిత, వైష్ణవికి పురస్కారాలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీ ఏడకొండలు పాల్గొన్నారు.